అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలి

- మండలాధికారులకు కలెక్టర్ కోటేశ్వరరావు ఆదేశం

కర్నూలు(సెంట్రల్) : ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలని కలెక్టర్ పి.కోటేశ్వరారావు మండలాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వివిధ సంక్షేమ పథకాల అమలుపై అన్ని శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రూఫ్ లెవల్‌లో ఉన్న వాటిని రూఫ్ కాస్టు, రూఫ్ కాస్టులో ఉన్న ఇళ్లను పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయించాలన్నారు. కాగా, పూర్తయిన ఇళ్లకు వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజాప్రతినిధులు సూచించిన పనులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. టెండర్ దశలో ఉన్న పనులను పురోగతిలోకి తీసుకురావాలన్నారు. పూర్తయిన నిర్మాణాలకు సంబంధించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. నాడు–నేడుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కాంపౌండ్‌లు, అదనపు తరగతి గదుల నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. పూర్తయిన ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను ప్రారంభించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, సీపీఓ అప్పలకొండ, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు, చిత్రంలో జేసీ

ఆర్థిక మోసాలపై అవగాహన

డిజిటల్ ప్రపంచీకరణ నేపథ్యంలో ఆర్థిక మోసాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సులను నిర్వహించాలని బ్యాంకర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యత –2023పై ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేషనల్ స్ట్రాటీ ఫర్ ఫైనాన్సియల్ ఎడ్యుకేషన్ 2020– 2025లో భాగంగా మంచి ఆర్థిక ప్రవర్తనే-మీకు రక్ష అనే నినాదంతో రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో బ్యాంకుల క్రియాశీలపాదుపు, ప్రణాళిక, బడ్జెట్, డిజిటల్ ఫైనాన్సియల్ సర్వీసెస్‌పై వివేకవంతమైన విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకు ఖాతాదారులు డిజిటల్ లావాదేవీలు జరపడంలో అప్రమత్తతను తెలియజేయాలన్నారు. ఖాతా వివరాలు, ఏటీఎం, క్రెడిట్, డెబిట్ కార్డుల వినియోగ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం వై.వెంకటనారాయణ, స్టేట్ బ్యాంకు చీఫ్ మేనేజర్ రాజరత్నం, యూబీఐ డిప్యూటీ రీజినల్ మేనేజర్ వెంకటరామిరెడ్డి, డైరెక్టర్ శివప్రసాద్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సీనియర్ మేనేజర్ ఆజాద్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష వీడాలి



కుష్టువ్యాధి నివారణపై ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కుష్టు వ్యాధిగ్రస్తులపట్ల వివక్ష వీడి, వారిని ప్రధాన జనజీవన స్రవంతిలోకి తీసుకురావడానికి అన్ని విధాల కృషి చేయాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సుధాకర్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. సోమవారం ఆసుపత్రి ఆవరణలో కుష్టువ్యాధి అవగాహన పక్షోత్సవాల ముగింపు సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు ఉన్నా, చెవులు, ముఖం, కణతలు, చేతులు, కాళ్లపై స్పర్శ తగ్గినా కనురెప్పలు, కనుబొమ్మల వెంట్రుకలు రాలిపోతున్నా కుష్టు వ్యాధి లక్షణాలుగా గుర్తించాలన్నారు. అనంతరం వారి కుటుంబసభ్యులు, ఇరుగుపొరుగుల వారిని గమనించి లక్షణాలుంటే పరీక్ష చేయాలన్నారు. ఈ వ్యాధిగ్రస్తులపై సమాజంలో ఏ విధమైన వివక్ష చూపకుండా వారికి తగిన చికిత్స అందిస్తే పూర్తిగా నయం అవుతుందన్నారు. సకల వైద్యంతో అంగవైకల్యం నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, చర్మవ్యాధి విభాగం హెచ్ఓడీ డాక్టర్ పెంచలయ్య, జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ శ్రీరాములు, రేడియాలజీ హెచ్ఓడీ డాక్టర్ రాధారాణి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టెలికామ్ సలహా మండలి సభ్యుడిగా కుబేరస్వామి



కర్నూలు(అర్బన్): భారత ప్రభుత్వ సమాచార మంత్రిత్వ శాఖ పరిధిలోని టెలికామ్ సలహా మండలి సభ్యుడిగా జిల్లాకు చెందిన ఎం. కుబేరస్వామి నియమితులయ్యారు. ఈ మేరకు టెలికమ్యూనికేషన్స్ శాఖ పీహెచ్‌పీ సెక్షన్ ఎస్ఓ ఎస్‌కే ఘోష్ జారీ చేసిన ఉత్తర్వులను సోమవారం స్థానిక బీఎస్ఎన్ఎల్ అధికారులు ఆయనకు అందించారు. ఈ సందర్భంగా కుబేరస్వామి మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో నెరవేరుస్తానన్నారు. తనను టీఏసీ మెంబర్‌గా నియమించడం పట్ల స్థానిక పార్లమెంట్ సభ్యులు డా.ఎస్ సంజీవ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్‌గా మోహన్ కుమార్

కర్నూలు (టౌన్) : నగరపాలక టౌన్‌ప్లానింగ్ ఇన్‌చార్ సిటీ ప్లానర్‌గా యు. మోహన్‌కుమార్ నియమితులయ్యారు. టౌన్ ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న పి. ప్రదీప్‌కుమార్‌ను బదిలీ చేసిన విషయం విదితమే.

పెండింగ్ జీతాలు ఇవ్వాలి

కర్నూలు (న్యూటౌన్): స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే మంజూరు చేయాలని స్వచ్ఛ భారత్ కార్మికుల సంఘం మండల కార్యదర్శి నాగరాజు కోరారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం మురికి వాడల్లో చెత్త కుప్పల్లో బతుకుతూ పని చేస్తున్నామన్నారు. గ్లౌజులు, మాస్కులు, శానిటైజర్‌లు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీటితో పాటు పెండింగ్‌లో ఉన్న 25 నెలలుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సంఘం మండల అధ్యక్షులు హుస్సేనయ్య, నాయకులు రాఘవేంద్ర, కార్మికులు మద్దిలేటి, నాగన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): విజయ పాల డెయిరీలో తొలగించిన 9 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం యూనియన్‌ను ఏర్పాటు చేసుకుంటే తొలగించడం అన్యాయమన్నారు. ఇది నియంతృత్వ ధోరణికి అద్దం పడుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు గురుశేఖర్, జయ నాగేశ్వరరావు, రామకృష్ణ, నరసింహులు, సాయిబాబా, రాముడు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

18న మహా శివరాత్రి ఉత్సవాలు

కర్నూలు కల్చరల్: కర్నూలు సూర్యనారాయణ స్వామి దేవాలయం ఆవరణలోని గౌరీ శంకర స్వామి ఆలయంలో ఈనెల 18వ తేదీన శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. ప్రాతఃకాలం నుంచి రుద్రాభిషేకం, నవగ్రహ, లక్ష్మీ గణపతి మూల మంత్ర సహిత, అఘోర పాశుపత రుద్రహోమం జరుగుతుందని తెలిపారు. రాత్రి 7 గంటలకు శివపార్వతుల కల్యాణం, మహాన్యాస పూర్వక ఏకాదశ వార రుద్ర అభిషేక పూర్వక సహస్ర ఘట్టాభిషేకాలు, 1008 కలశాలతో శ్రీ గౌరీ శంకరులకు అభిషేకాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ ఏడాది శని త్రయోదశి పూర్వక మహా శివరాత్రి రావటం ఎంతో విశేషమైందని తెలిపారు. ఉత్సవాల్లో భక్తులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

పల్లకీలో మహానందీశ్వరుడు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి దంపతులు సోమవారం రాత్రి పల్లకీలో కొలువై విహరించారు. ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవ వైభవంగా జరిగింది. సోమవారం కావడంతో మహానంది క్షేత్రం భక్తులతో కళకళలాడింది. వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. కార్యక్రమాల్లో ఆలయ సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ హరినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్: పఠాన్, వీర సింహారెడ్డి, వాల్తేర్ వీరయ్య, మైఖేల్, వారసుడు, అమిగోస్, టైటానిక్, రైటర్ పద్మభూషణ్, నువ్వొస్తానంటే నేనొద్దంటానా
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : వీర సింహారెడ్డి, వారసుడు, అమిగోస్, వసంత కోకిల, రైటర్ పద్మభూషణ్, నువ్వొస్తానంటే నేనొద్దంటానా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేర్ వీరయ్య, అమిగోస్
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్, పఠాన్, రైటర్ పద్మభూషణ్, టైటానిక్, నువ్వొస్తానంటే నేనొద్దంటానా
భరత్ కాంప్లెక్స్: పఠాన్, వేదా, వారసుడు
రాజ్ : పాప్ కార్న్
శ్రీరామ : అమిగోస్
విజయ : వేదా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ద్వారం ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. స్థానిక బి.క్యాంపులోని ప్రభుత్వ గిరిజన గురుకుల సంక్షేమ బాలికల పాఠశాలలో సోమవారం 'జీవనశైలి, మన ఆరోగ్యం–గృహవైద్యం' అనే అంశంపై ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే వేసవి కాలంలో, రుతు సంధిలో సీజనల్ వ్యాధులకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చెప్పారు. ముఖ్యంగా ఆత్మన్యూనతా భావానికి గురిగాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార, విహార, నడక, వ్యాయామం, ప్రాణాయామం, ధ్యానం, యోగ పద్ధతులు, పోపుగింజల ప్రాధాన్యత గురించి వివరించారు. పిల్లలు, పెద్దలు దురలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. లక్ష్మిగుర్రప్ప, వైస్ ప్రిన్సిపాల్ ఎం. సలోమి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ టి. సుప్రజ, కాంపౌండర్ ఆర్. మంగమ్మ పాల్గొన్నారు.

'అప్పర్‌భద్ర'ను నిలిపివేయాలి

కర్నూలు(సెంట్రల్): కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న అప్పర్‌భద్ర ప్రాజెక్టును తక్షణమే నిలిపివేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అప్పర్ భద్రతో రాయలసీమ ఎడారిగా మారుతుందన్నారు. కేసీ కెనాల్, ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ, హంద్రీనీవా రిజర్వాయర్లకు చుక్కనీరు రాదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిలుపుదల చేయించాలన్నారు. కర్ణాటక ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందేందుకు బీజేపీ కర్ణాటక, ఆంధ్రాల మధ్య తగువు రాజేసిందన్నారు. ఎన్నికల కోసం చేపట్టే అప్పర్ భద్రను అడ్డుకోవడానికి రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఏకమై పోరాటానికి దిగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.జగన్నాథం, ఎండీ అంజిబాబు, పోతుల శేఖర్, సుంకన్న, వెంకటేశ్వర్లు, రామకృష్ణారెడ్డి, గురుశేఖర్ పాల్గొన్నారు.

జి.పుల్లయ్యలో వర్క్‌షాప్

కర్నూలు సిటీ: స్థానిక జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీలో ఎడ్యుస్కిల్స్ సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు వర్క్‌షాపు నిర్వహించారు. సోమవారం ఈ వర్క్‌షాపును ఆ సంస్థ ప్రతినిధి (ఆపరేషన్స్) బిబెక్ రంజన్ అతిథిగా హాజరై ప్రసంగించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటే సాధించలేనిదంటూ ఏదీ లేదన్నారు. మహిళ సాధికారతకు టెక్నాలజీ దోహదపడుతుందన్నారు. మూడు రోజుల పాటు జరగనున్న వర్క్‌షాపులో అమోజాన్ వెబ్ సర్వీసెస్ సర్టిఫికెట్ కోర్సు నేర్పిస్తామన్నారు. దీని ద్వారా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కర్నూలు ట్రిపుల్ ఐటీడీఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ప్రణీతశ్రీ మాట్లాడుతూ సాంకేతిక రంగంలో మహిళలు రాణిస్తేనే మహిళ సాధికారత సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.సి. శ్రీనివాసరావు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాధిపతి సుమన్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు తీర్చాలి

కర్నూలు(సెంట్రల్) : స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శులు నాగరాజు, హుస్సేనయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వెంటనే పెండింగ్‌లోని జీతాలను విడుదల చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుభాకర్ పాల్గొన్నారు.

వక్ఫ్‌భూములను లీజుకివ్వాలి

కర్నూలు(రాజ్‌విహార్): వక్ఫ్‌బోర్డు భూములను చట్ట ప్రకారం లీజుకివ్వాలని కర్నూలు మండలం జి. శింగవరం గ్రామానికి చెందిన ఎం.నాగన్న, ఎం.చిన్న నాగన్న కోరారు. సోమవారం ఆయన జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో 62.26 ఎకరాల వక్ఫ్ భూమి ఉందని, దీనిని కొందరు వ్యక్తులు ముతవల్లులమని చెప్పి అనధికారికంగా లీజుకిచ్చి లబ్ధి పొందుతున్నారన్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి చట్ట ప్రకారం లీజుకివ్వాలని విన్నవించారు.

దాడులను అడ్డుకోండి

కర్నూలు(సెంట్రల్): ప్రపంచ ప్రేమికుల దినోత్సవాన్ని ఫిబ్రవరి 14వ తేదీన స్వేచ్ఛగా జరుపుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ పిలుపునిచ్చారు. సోమవారం సుందరయ్య భవన్‌లో ఆయన మాట్లాడుతూ..కొందరు మతతత్వ శక్తులు ప్రేమికుల దినోత్సవాన్ని అడ్డుకోవాలని చూస్తున్నాయన్నారు. ప్రేమికులపై దాడులు చేసేందుకు చూడడం అన్యాయమన్నారు. ఎక్కడైనా ప్రేమికులపై అల్లరి మూకలు దాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

నేటి నుంచి అన్నమయ్యకు సంగీత నృత్య నీరాజనం

కర్నూలు కల్చరల్: తిరుపతి అన్నమయ్య జానపద కళాక్షేత్రం హైదరాబాద్ కోవిదా సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు అన్నమయ్యకు సంగీత నృత్య నీరాజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు శేషయ్య తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగే ఈ కార్యక్రమంలో వివిధ సంగీత నృత్య కళాశాలల విద్యార్థులు, పలు విద్యా సంస్థల విద్యార్థులతో సంగీత నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు.

ఉత్సవాలకు ఆహ్వానం

మహానంది: మహానందిలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని సోమవారం పలువురు ప్రముఖులకు ఆహ్వానపత్రికలు అందించినట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడి సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు నంద్యాలకు వెళ్లి ప్రముఖులను కలిశారు. అందులో భాగంగా ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ నిశాంతిలకు ఆహ్వానపత్రికలు అందించారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్‌కు విద్యార్థి ఎంపిక



కర్నూలు (టౌన్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 19 వరకు మచిలీపట్నంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి అండర్–14 క్రికెట్ పోటీలకు కర్నూలు నగరంలోని సంకల్‌బాగ్‌లో ఉన్న శ్రీచైతన్య విద్యార్థి బి.గౌతమ్ ఎంపికయ్యారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేయంలో నిర్వహించిన పోటీల్లో సదరు విద్యార్థి ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర పోటీలకు ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు డీన్ రామాంజనేయులు, రంగనాయకులు పాల్గొన్నారు.

చౌక్‌బాల్ పోటీల్లో విజయం


పతకాలు సాధించిన క్రీడాకారిణులతో రోజమ్మ

కర్నూలు (టౌన్) : ఈనెల 4, 5 తేదీల్లో తెలంగాణ రాష్ట్రంలోని షాద్‌నగర్‌లో జరిగిన 5 వ జాతీయ స్థాయి చౌక్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలుకు చెందిన సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు విజేతగా నిలిచారు. పతకాలు, ప్రశంసా పత్రాలు సాధించిన ఎస్. ఇంద్రజ, బి. రక్షిత, ఎస్. అనూషలను కళాశాల ప్రిన్సిపాల్ పోలిన్, కరస్పాండెంట్ రోజమ్మ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్యామల పాల్గొన్నారు.

పోలీసు ఈవెంట్స్‌లోనూ రాణించాలి


మెయిన్స్‌కు అర్హత పొందిన అభ్యర్థులతో మాజీ ఎంపీ బుట్టా రేణుక

కర్నూలు సిటీ: పోలీసు కానిస్టేబుల్ నియామకాలకు ఇటీవల నిర్వహించిన ప్రిలిమ్స్‌లో అర్హత పొందిన అభ్యర్థులను కర్నూలు పార్లమెంట్ మాజీ సభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు బుట్టా రేణుక అభినందించారు. బుట్టా ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తమ ఫౌండేషన్ ద్వారా ఉచిత కోచింగ్ పొంది ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత పొందడం ఆనందంగా ఉందన్నారు. ఈవెంట్స్‌లోనూ ప్రతిభ చూపించి ఉద్యోగాలు పొందాలన్నారు. జిల్లాలోనే అత్యధిక మార్కులు పొందిన బాబు నాయక్‌ను ఆమె ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌వీఆర్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, పీఈటీ డా.భారతి, లెక్చరర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ చౌదరి సేవలు ఎనలేనివి

కర్నూలు (టౌన్) : రాష్ట్రంలో బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సీనియర్ జాయింట్ కార్యదర్శి అంకమ్మ చౌదరి అందించిన సేవలు ఎనలేనివని ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ రెడ్డి అన్నారు. అంకమ్మ చౌదరి అకాల మృతి నేపథ్యంలో సోమవారం స్థానిక మౌర్య ఇన్ పరిణయ హాలులో ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకమ్మ చౌదరి మృతి రాష్ట్ర బ్యాడ్మింటన్ రంగానికి తీరని లోటన్నారు. తమ అసోసియేషన్‌కు సంబంధించి రిజిస్టర్ ఆఫీసును రావులపాలెంలో ఏర్పాటు చేసేందుకు తీర్మానించినట్లు వెల్లడించారు. సమావేశంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి శ్రీనివాస భట్ కార్యవర్గ సభ్యులు భరణి, సురేష్, ఎస్‌కే మహేష్, సతీష్, రవి పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాల్లో పరిశుభ్రత పాటించాలి


అన్నదాన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం నిర్వహించే అన్నదాన కార్యక్రమాల్లో పరిశుభ్రత పాటించాలని నిర్వాహకులకు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సోమవారం స్థానిక పెద్దపాడు వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రీశైలంలో జరిగే శివరాత్రి బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి పాదయాత్ర చేస్తూ భక్తులు శ్రీశైలం చేరుకుంటారన్నారు. వారిని అతిథులుగా భావించి వివిధ ప్రదేశాల్లో అన్నదాన కార్యక్రమాలు విరివిగా నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. వేసవి కాలం దృష్ట్యా భక్తులు, దాతలు తగు ఆరోగ్య సూచనలు పాటించాలన్నారు. పరిశుభ్రమైన ఆహారం, నీటినే తాగాలన్నారు. భోజనం తయారు చేసే పాత్రలు వేడినీటిలో కడగాలన్నారు. ఎండ తీవ్రతకు భక్తులు అలసిపోకుండా ఉండేందుకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిమ్మరసం, చక్కెర ద్రావణం, మజ్జిగలో కొద్దిగా ఉప్పు కలిపి ఇవ్వాలన్నారు. భక్తుల ఆరోగ్యరీత్యా రేమట, సి.బెళగల్, పోలకల్, గూడూరు, కోడుమూరు, పెంచికలపాడు, పెద్దపాడు, కల్లూరు, గార్గేయపురంలలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశామన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎ.నాగేశ్వరరావు

కర్నూలు(అర్బన్) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల వసతి గృహాల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారి ఎ.నాగేశ్వరరావు కోరారు. సోమవారం రాత్రి ఆయన స్థానిక బి.క్యాంప్‌లోని బీసీ, డీఎన్‌టీ బాలుర వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన రెండు హాస్టళ్లలో విద్యార్థుల హాజరు పట్టికతో పాటు వివిధ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులందరూ వంద శాతం ఉత్తీర్ణులయ్యేలా సంబంధిత వసతి గృహ సంక్షేమాధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. అన్ని వసతి గృహాల్లో స్టడీ అవర్స్‌ను పెంచడంతో పాటు విద్యార్థులను ఏ, బి, సి, డి గ్రూపులుగా విభజించి చదివించాలని చెప్పారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించి అనుమానాలను నివృత్తి చేసేందుకు ట్యూటర్లు ఆయా సమయాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వసతి గృహ సంక్షేమాధికారులు రెగ్యులర్‌గా హాస్టళ్లలోనే ఉంటూ పదవ తరగతి విద్యార్థులపై ఫోకస్ పెట్టాలన్నారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారులు ఎం.శ్రీనివాసులు, మహాలక్ష్మి ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న బీసీ సంక్షేమం, సాధికారత అధికారి ఎ.నాగేశ్వరరావు

అంతర్జాతీయ సైన్స్ క్విజ్ పోటీల్లో ప్రతిభ


విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: దక్షిణ భారత దేశ స్థాయిలో నిర్వహించిన అంతర్జాతీయ సైన్స్ క్విజ్ పోటీల జూనియర్స్ విభాగంలో కర్నూలు విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. ఎస్వీ సుబ్బారెడ్డి ఫౌండేషన్, అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో రెండవ దశ అంతర్జాతీయ స్థాయి సైన్స్ క్విజ్ చాంపియన్‌షిప్ పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించగా రవీంద్ర విద్యానికేతన్ 7వ తరగతి విద్యార్థి ఆదిత్య, ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాల ఏడో తరగతి విద్యార్థి పవన్ సందేశ్ రెడ్డి గ్రూప్‌లు సత్తాచాటి విజేతలుగా నిలిచాయి. ఆదివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అదజేశారు. అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ అధ్యక్షుడు వీఎం రావు, ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ అవినాష్ ఓరి, వైస్ ప్రెసిడెంట్ మాతి వనన్, మాజీ సౌత్‌మల్టీపుల్ కౌన్సిల్ చైర్మన్ బాలచంద్రన్, సైన్స్ క్విజ్ కో ఆర్డినేటర్ నవీన్ శెట్టిగర్, ఏపీ సైన్స్ కో–ఆర్డినేటర్ అల్లాయ్ అండ్ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సౌత్ మల్టీపుల్ చైర్మన్ బొజ్జ మధుసూదన్, రాయపాటి నాగలక్ష్మి, గిరి తదితరులు పాల్గొన్నారు. కాగా విజేతలకు ఎస్వీ సుబ్బారెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ విజయ మనోహరి సోమవారం ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు.

సీడ్ సర్టిఫికేషన్ పెద్ద ఎత్తున చేపట్టాలి

- అప్పుడే రైతులకు నాణ్యమైన విత్తనం లభ్యం
- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి వెల్లడి
- కర్నూలు సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ కార్యాలయం సందర్శన


సీడ్ సర్టిఫికేషన్ విధానాన్ని వివరిస్తున్న రాయలసీమ చీఫ్ సీడ్ సర్టిఫికేషన్ అధికారి వెంకటరామిరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): నాణ్యమైన విత్తనాల కోసం పత్తితో సహా అన్ని పంటల్లో విత్తన ధ్రువీకరణ పెద్ద ఎత్తున చేపట్టాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి సీడ్ సర్టిఫికేషన్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన కర్నూలులోని సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ కార్యాలయాన్ని సందర్శించారు. ఏఏ పంటలకు సంబంధించి సీడ్ సర్టిఫికేషన్ చేస్తున్నారు. మార్కెట్‌లో విత్తనాలు అమ్ముకోవాలంటే పాటించాల్సిన పద్ధతులు తదితర వాటిని పరిశీలించారు. రాయలసీమ జిల్లాల చీఫ్ సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా సీడ్ సర్టిఫికేషన్ ఇస్తున్నామని తెలిపారు. 2022–23లో ప్రధానంగా 23 వేల ఎకరాల్లో సాగు చేసిన శనగ, వేరుశనగ, మొక్కజొన్న, సజ్జ, కందులు, మినుము తదితర పంటల్లో సీడ్ సర్టిఫికేషన్ కోసం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు కూడా నోటిఫైడ్ వెరైటీలు సాగు చేసినప్పుడు సీడ్ సర్టిఫికేషన్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు. తాము సర్టిఫై చేసిన విత్తనాలను మార్కెట్‌లో విక్రయించుకోవచ్చని తెలిపారు. పత్తికి సీడ్ సర్టిఫికేషన్ లేదని, కంపెనీలే స్వంతంగా సర్టిఫికెట్ ఇస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ... ఎక్కువ విస్తీర్ణంలో సీడ్ సర్టిఫికేషన్ చేస్తే రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ ఏడాది పత్తి పంట ఎక్కువగా దెబ్బతినిందని, విత్తనమే కారణమని రైతులు చెబుతున్నారన్నారు. ప్రభుత్వం తరపున విత్తన ధ్రువీకరణ లేకపోవడం రైతులకు ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. త్వరలో జరిగే రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సమావేశంలో సీడ్ సర్టిఫికేషన్‌ను పెద్ద ఎత్తున చేపట్టాల్సిన అవసరాన్ని ప్రస్తావిస్తామని తెలిపారు. పత్తిలో కూడా ప్రభుత్వం తరపున సీడ్ సర్టిఫికేషన్ జరగాలని కోరుతామన్నారు. కార్యక్రమంలో సీడ్ సర్టిఫికేషన్ అధికారులు పాల్గొన్నారు.